క్లుప్తంగా

ఎస్‌ఐ వీరబ్రహ్మంకు సన్మానం



వీరబ్రహ్మంను సన్మానిస్తున్న విశ్వకర్మ సంఘం నాయకులు

చేవెళ్ల: ఇటీవల చేవెళ్ల ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన వీరబ్రహ్మంను చేవెళ్ల బ్రహ్మగిరి క్షేత్రం విశ్వబ్రహ్మణ విశ్వకర్మ సంఘం నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లింగచారి, మాణిక్యచారి, బాలస్వామి, శ్రీనివాస్, శంభులింగం, సత్యనారాయణ, రాఘవేంద్రచారి, విష్ణుశ్, అక్షయ్‌చారి పాల్గొన్నారు. అనంతరం బీజేపీ నాయకులు ఎస్‌ఐ వీరబ్రహంను కలిసి శాలువతో సన్మానించారు. ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్, నాయకులు రింజత్, శ్రీనివాస్, మాహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీసేవ

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకిని పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. అనంతరం పట్టణానికి చెందిన రామకృష్ణ, ధర్మకర్ రవి ప్రకాష్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లతాశ్రీ, నాయకులు శ్రీశైలంగౌడ్, ఎంసాని నర్సింలు, వసంతరావు, రఘుగౌడ్, రమేష్, లక్ష్మయ్య, రఘునందన్‌రెడ్డి, అర్చకులు రఘుపతిరావు, కృష్ణ, ప్రమోద్, సునీల్ పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

కొందుర్గు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఇళ్లు కూలిపోయిన బాధితులకు అండగా ఉంటామని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం కొందుర్గు, బైరంపల్లి, మహదేవ్‌పూర్, రామచంద్రాపూర్, సోమారంపహాడ్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు కూలిపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం 20 మంది బాధితులకు రూ.5వేల చొప్పున నగదు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, నాయకులు నరేందర్, రవి, వజ్రమ్మ, మల్లేష్‌గౌడ్, అంజిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, రామస్వామి పాల్గొన్నారు.

సీతారాంపూర్‌లో కూలిన ఇల్లు



కూలిన ఇల్లు

షాబాద్: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన కటికే సందీప్ ఇల్లు శుక్రవారం రాత్రి కూలిపోయింది. ఇప్పటివరకు మండలంలో 8 ఇళ్లు కూలిపోయినట్లు అధికారులు రెవెన్యూ తెలిపారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

మొయినాబాద్‌రూరల్: రైతులందరూ తమ పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని అమ్డాపూర్ పశువైద్య అధికారి దేవిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి గాలికుంటు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. పశువులకు లాంపీ స్కిన్ వ్యాధి, తెల్లజాతి పశువుల్లో వ్యాప్తి చెందకుండా అరికట్టడానికి గోజాతి పశువులకు ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి

చేవెళ్ల: తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకుడు, చేవెళ్ల నియోజకవర్గం బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు దేశమొల్ల ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శనివారం ఉద్యమకారుల సదస్సు నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సుకు ఉద్యమకారులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఉద్యమకారుల ఫోరం పార్లమెంట్ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి, జిల్లా మీడియా కార్యదర్శి రాజు, జిల్లా నాయకులు నవీన్‌కుమార్, మాణిక్యరెడ్డి, బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, మల్లేశ్, పాండుయాదవ్, కృష్ణారెడ్డి, నర్సింహులు, ఆర్‌కే నాగని, చందు, లక్ష్మీనారాయణ, అరుణ్, రాజు పాల్గొన్నారు.

ఏకగ్రీవమైనా.. జాడలేని అభివృద్ధి



పోలారం గ్రామ పంచాయతీ కార్యాలయం

- నేటికీ అందని నజరానా, ప్రోత్సాహక నిధులు
- ఏకగ్రీవ పంచాయతీలలో సమస్యల తిష్ట
- నిధుల కోసం సర్పంచ్‌ల ఎదురుచూపు

షాబాద్: ఎన్నికల సమయంలో ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10లక్షల నజరానా, ప్రత్యేక ప్రోత్సాహక నిధులు ఇస్తామన్న ప్రభుత్వ హామీ ప్రకటనలకే పరిమితమైంది తప్ప ఆచరణలో అమలుకావడంలేదు. గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమైతే గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చన్న ధీమాతో ఎదురుచూసిన సర్పంచ్‌లకు, ప్రజలకు నిరాశే మిగిలింది. ఎన్నికలు జరిగి నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ ప్రోత్సాహక నిధులు, నజరానా అందకపోవడంతో గ్రామ సమస్యలను పరిష్కరించలేక.. ప్రజలకు సమాధానం చెప్పలేక సర్పంచ్‌లు సతమవుతున్న పరిస్థితి నెలకొంది.

సమస్యలకు నిలయాలుగా ఏకగ్రీవ పంచాయతీలు

మండల పరిధిలోని 41 గ్రామ పంచాయతీలలో 5 గ్రామాలు ఏకగ్రీవ పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నిధులు మంజూరైతే గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చనే నమ్మకంతో సర్పంచ్‌లు ఏళ్ల తరబడిగా ఎదురుచూస్తున్నారు. పంచాయతీలు ఏకగ్రీవమైతే ప్రోత్సాహక నిధులతో పాటు అదనంగా మరో రూ.5లక్షలు ఇస్తామన్న ప్రభుత్వ పెద్దల మాటలు నమ్మితే నిరాశే మిగిలిందని సర్పంచ్‌లు వాపోతున్నారు.

ఆదాయ వనరులు కరువు

గ్రామ పంచాయతీల్లో సమస్యలు పరిష్కారం కావాలంటే ముందుగా నిధులు ఉండాలి. అందుకు అనుగుణంగా ఆదాయ మార్గాలు ఉంటేనే నిధుల కొరతను అధిగమించవచ్చు. కానీ.. జనాభా తక్కువగా ఉండడం, ఆదాయ వనరులు లేకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. వేధిస్తున్న నిధుల కొరత అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రత్యేక నిధులను జనాభా ప్రాతిపాదికన ఇస్తుండడంతో ఏకగ్రీవ పంచాయతీలకు ప్రయోజనం చేకూరడంలేదు. కనీసం వీధిలైట్లు, తాగునీటి మోటార్ల విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోరుతున్నారు.

అభివృద్ధి కుంటుపడుతోంది



గతంలో మా గ్రామం మాచన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. ఆ తర్వాత కొత్త పంచాయతీరాజ్ చట్టంలో భాగంగా పోలారం గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయగా గ్రామాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని గ్రామస్తులు తనను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.10లక్షల నిధులు రాకపోవడంతో గ్రామాభివృద్ధి కుంటుపడుతోంది.

– మంగమ్మ, సర్పంచ్, పోలారం

నిధులు మంజూరు చేయాలి



గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని నమ్మి నన్ను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహకం అందజేస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏకగ్రీవ పంచాయతీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి.

– శ్రీధర్‌రెడ్డి సర్పంచ్, తిర్మలాపూర్

ప్రతిపాదనలు పంపించాం

మండలంలో 41 గ్రామ పంచాయతీల్లో 5 గ్రామ పంచాయతీలు ఏకగ్రీంగా ఎన్నికయ్యాయి. ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.10లక్షల చొప్పున ప్రోత్సాహక నిధులు మంజూరు చేస్తామని గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే అందజేస్తాం.

– అనురాధ ఎంపీడీఓ, షాబాద్

రహదారుల అభివృద్ధికి పెద్దపీట



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: రహదారుల అభివృద్ధికి పెద్దపీట ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని జేపీ దర్గా నుంచి ఎక్లాస్‌ఖాన్‌పేట వరకు మంజూరైన బీటీ రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణాలతో పాటు మారుమూల గ్రామాలకు సైతం బీటీ రోడ్లు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. జేపీ దర్గా నుంచి ఎక్లాస్‌ఖాన్‌పేట వరకు 6కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు ఏర్పాటుకు రూ.6కోట్ల నిధులు మంజూరైనట్లు వివరించారు. అనంతరం జేపీ దర్గాలో నిర్వహించిన మొహర్రం వేడుకల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. అదేవిధంగా కొడిచర్ల గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రహరీ పనులకు శంకుస్థాపన చేశారు. రైతు సమన్వయ సమితి కొత్తూరు మండల అధ్యక్షుడిగా ఎన్నికైన కొడిచర్లకు చెందిన కొమ్మ నర్సింహారెడ్డికి నియామకపత్రాన్ని అందజేశారు. ఇన్ చార్జి ఎంపీపీ శోభాలింగంనాయక్, ఇన్ముల్‌నర్వ సర్పంచ్ అజయ్‌నాయక్, నాయకులు ఎమ్మె సత్యనారాయణ, మిట్టునాయక్, యాదగిరి, రషీద్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

రైతుబీమా ప్రొసిడింగ్ అందజేత

నందిగామ: మండల పరిధిలోని చేగూరుకు చెందిన కొంగర శేఖర్ ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో రైతుబీమా ద్వారా మంజూరైన రూ.5లక్షల ప్రొసిడింగ్‌ను మృతుడి భార్య మంజులకు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ శనివారం అయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని వివరించారు. జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్, పీఏసీఎస్ చైర్మన్ రాజ్‌గోపాల్, మాజీ చైర్మన్ మామిళ్ల విఠల్, నాయకులు పాల్గొన్నారు.

పాతకక్షలతో ఇరువర్గాల దాడి

- ఒకరికి తీవ్ర గాయాలు
- నగరానికి తరలింపు
- పలువురిపై కేసులు నమోదు

చేవెళ్ల: మండలంలోని ముడిమ్యాల గ్రామంలో శుక్రవారం రాత్రి రెండు వర్గాలు దాడులకు పాల్పడడంతో ఇరు వర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. చేవెళ్ల పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన చాకలి శ్రీనివాస్‌కు గోనే జంగారెడ్డితో పాతకక్షలు ఉన్నాయి. శ్రీనివాస్ తన స్నేహితులు మహేందర్, రాములుతో కలసి మద్యం తాగాడు. గ్రామానికి వస్తూ జంగారెడ్డి ఫాంహౌస్‌పై రాళ్లతో దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. అ సమయంలో జంగారెడ్డి ఫాంహౌస్‌లో లేడు. సమీపంలోని జేసీబీ డ్రైవర్ అప్సర్ రాళ్లు ఎందుకు వేస్తున్నారని శ్రీనివాస్‌ను ప్రశ్నించాడు. దీంతో అప్సర్‌పై శ్రీనివాస్ కర్రతో దాడి చేసి గాయపరిచారు. క్షతగాత్రుడు జంగారెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. అతని సూచనల మేరకు గ్రామస్తులకు చెప్పాడు. కొంత మంది ఫాంహౌస్ వద్దకు వచ్చి అద్దాలు ఎందుకు పగులగొట్టావని శ్రీనివాస్‌ను నిలదీయడంతో వారి మధ్య మాటామాట పెరిగి కర్రలతో దాడి చేసుకోగా చాకలి శ్రీనివాస్ తలకు బలమైన గాయం తగిలింది. దీంతో జేసీబీ డ్రైవర్లు అతన్ని ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పాతకక్షల కారణంగానే ఇరువర్గాలు దాడులు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కావాలనే తన భర్తపై దాడి చేశారని శ్రీనివాస్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తన ఫాంహౌస్‌పై శ్రీనివాస్ దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశాడని గోనే జంగారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు.

పోలీస్ స్టేషన్ సందర్శన



సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

కేశంపేట: షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి శనివారం కేశంపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి వివిధ ఫైళ్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో సిబ్బంది నిర్వహించాల్సిన విధులను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బీఎస్ఎస్ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రవికుమార్

నందిగామ: వచ్చే నెల ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్ మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సాయి మాదిగ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపుమేరకు విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలన్నారు. అదేవిధంగా ఆగస్టు 2వ తేదిన మహేశ్వరం మండల కేంద్రంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాములు, లక్ష్మయ్య, అశోక్, శ్రీను, రమేష్, శివ, శేఖర్, మహేందర్, విజయ్ పాల్గొన్నారు.

కుంటలో దూకి మహిళ ఆత్మహత్య

నందిగామ: నీటికుంటలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని చేగూరు శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పద్మమ్మ(45) ఉదయం కుటుంబ సభ్యులతో ఘర్షణ పడి బయటకు వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం గాలిస్తుండగా గ్రామ శివారులోని మోడెం కుంటలో మృతదేహం లభించింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో జేఎల్‌ఎంకు గాయాలు

మొయినాబాద్: విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం)కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని సజ్జన్‌పల్లిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద హెడ్‌ఫ్యూజ్ పోవడంతో శనివారం సాయంత్రం జూనియర్ లైన్‌మెన్ లక్ష్మణ్ ఫ్యూజ్ వేయడానికి వచ్చాడు. అతని వెంట లైన్‌మెన్ కూడా ఉన్నారు. సబ్‌స్టేషన్‌లోని ఆపరేటర్‌కు ఫోన్ చేసి ఎల్సీ తీసుకుని హెడ్ ఫ్యూజ్ వేయడానికి లక్ష్మణ్ ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కాడు. ఎల్సీ తీసుకున్నా విద్యుత్ సరఫరా ఉండటంతో పైకి ఎక్కగానే లక్ష్మణ్‌కు విద్యుదాఘాతానికి గురై చేతులు, కాళ్లు, చాతి భాగంలో చర్మం కాలిపోయి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

కొత్తూరు: బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని పహడిషరీఫ్ ప్రాంతానికి చెందిన ఎండీ ఇబ్రహీం(30) తన బైక్‌పై కొత్తూరు వైపునకు వస్తుండగా తిమ్మాపూర్ శివారులోకి రాగానే అదుపుతప్పి కిందపడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

నిందితుడికి రిమాండ్

కేశంపేట: మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామానికి చెందిన నాగపోగు గణేష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాగపోగు గణేష్ 2020లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. అయితే కేసు విషయంలో కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతుండటంతో ఎల్‌బీ నగర్ కోర్టు గణేష్‌కు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి చర్లపల్లి జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్ పాండుగౌడ్



వయోవృద్ధులతో పాండుగౌడ్, వైద్య సిబ్బంది

మొయినాబాద్: గ్రామీణ ప్రాంతంలోని పేదలు, వయోవృద్ధులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ లక్ష్యమని మాజీ ఎంపీపీ, సొసైటీ వైస్‌చైర్మన్ పాండుగౌడ్ అన్నారు. మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ మొబైల్ మెడికల్ యూనిట్ ద్వారా సర్పంచ్ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం పాండుగౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు అనురాగ్, శ్రీశైలేష్‌బాబు, చరిత్ర, ఉపసర్పంచ్ శిరీష, వార్డుసభ్యులు చంద్రయ్య, యాదయ్య, మేన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆశాకార్యకర్తలు లావణ్య, శ్యామల పాల్గొన్నారు.

మోకిలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయొద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని మోకిలను మున్సిపాలిటీ కేంద్రంగా చేయొద్దని మోకిల తండావాసులు శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోకిల, మోకిల తండా అభివృద్ధి పథంలో కొనసాగుతున్నాయన్నారు. మోకిల గ్రామం గ్రామ పంచాయతీగా ఏర్పాటై 5ఏళ్లు కూడా పూర్తి కాలేదన్నారు. కొంత మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఓటమి భయంతో మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారని వాపోయారు. మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తే ప్రజలకు పన్ను భారం పడుతుందన్నారు. మోకిలను మున్సిపాలిటీగా కేంద్రంగా ఏర్పాటు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోకిల తండా సర్పంచ్ నీలమ్మ, ఉప సర్పంచ్ నాణ్య, తెలంగాణ రాష్ట్ర లంబాడి హక్కుల పోరాట సమితి సభ్యుడు రవినాయక్, నాయకులు దేవ్‌లానాయక్, గోపాల్, నార్య, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

ఐకమత్యానికి ప్రతీక మొహర్రం

జిల్లా వ్యాప్తంగా మొహర్రం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు పీర్లను పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. వేడుకల్లో వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



షాబాద్: తాళ్లపల్లి గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మొయినాబాద్: సురంగల్‌లో పీర్ల ఊరేగింపు



చేవెళ్ల: ముడిమ్యాల గ్రామంలో..

పండుగ సాయన్నకు ఘన నివాళి



నందిగామ: సాయన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



షాబాద్: సాయన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నందిగామ: ముదిరాజ్‌ల ముద్దుబిడ్డ పండగ సాయన్న జయంతిని నందిగామ మండల కేంద్రంలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు మేకం రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీ వైస్‌చైర్మన్ ఈట గణేష్ హాజరై సాయన్నకు నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, నాయకులు రాములు, చందర్, మల్లేష్, నరేష్, శ్రీశైలం, మల్లేష్, యాదయ్య, రాములు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

షాబాద్: మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో పండుగ సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ సమ్మి పెంటయ్య, ప్రధానోపాధ్యాయులు దోస్వాడ నర్సింహులు మాట్లాడుతూ రజాకార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి నిరుపేద ప్రజలకు అండగా నిలిచారని కొనియాడారు. ఉపసర్పంచ్ విజయ, మాజీ ఉపసర్పంచ్ నర్సింహులు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కుమార్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి శ్రావణ్, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో..

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు మండల కేంద్రాల్లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు అందె బాబయ్య, కావలి యాదయ్య, శరత్, ఈసరి సత్యం, మల్లేష్, యాదయ్య, నర్సింలు, సత్యం, సంజయ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

వాగులకు జలకళ

మొయినాబాద్‌రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో చెరువులు, కుంటలు, జలకళను సంతరించుకున్నాయి. మండల పరిధిలోని నక్కలపల్లి చెరువు నిండగా, పక్కనే ఉన్న ఈసీ వాగు, చిన్నమంగళారం సమీపంలో మూసీవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాలతో వరి నార్లు, ఇతర పంటలు సాగుచేసుకునే అవకాశం ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అమ్డాపూర్ సమీపంలో ప్రవహిస్తున్న ఈసీ వాగు



నక్కలపల్లిలో నిండిన కుంట



చిన్నమంగళారం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీవాగు